
# బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 06 డిసెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## మహారాష్ట్ర సీఎంగా ఫడణవీస్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మహారాష్ట్ర 18వ ముఖ్యమంత్రిగా బీజేపీ నేత దేవేంద్ర ఫడణవీస్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆయనతో ప్రమాణం చేయించారు. దేవేంద్ర ఫడణవీస్ సీఎంగా ప్రమాణం చేయడం ఇది మూడోసారి కావడం విశేషం. అనంతరం శివసేన పార్టీ అధ్యక్షుడు ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ నేత అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు స్వీకరించారు. ముంబయి ఆజాద్ మైదాన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ తదితర ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, నేతలతోపాటు బాలీవుడ్ ప్రముఖులు హాజరయ్యారు.నూతన సీఎంగా బాధ్యతలు స్వీకరించిన ఫడణవీస్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం ఫడణవీస్, ఉప ముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్‌ను ప్రధాని అభినందించారు.

## తొలి ఏడాదిలో
# 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

- ప్రతి శాసనసభ నియోజకవర్గానికి 3,500 ఇండ్లు
- ప్రతి ఇంటికి రూ.5 లక్షలు
- ఐటీడీఏ పరిధిలో గిరిజనులకు ప్రత్యేక కోటా
- కేసీఆర్ ప్రతిపక్ష నేతగా సలహాలు ఇవ్వాలి
- కేటీఆర్, హరీశ్‌రావు తీరు మార్చుకోవాలి
- సీఎం రేవంత్ రెడ్డి
- ఇందిరమ్మ ఇండ్ల యాప్ ఆవిష్కరణ




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రతి శాసనసభ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలో తొలి ఏడాదిలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రతి ఇంటికి రూ.5 లక్షలు ఇస్తున్నామని.. దేశంలో ఇంత మొత్తం కేటాయిస్తున్న రాష్ట్రం తెలంగాణేనని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఇళ్ల నిర్మాణం ద్వారా పేదలకు ఆత్మ గౌరవాన్ని ఇందిరా గాంధీ కల్పించారని కొనియాడారు.ఆత్మగౌరవంతో బతకాలనుకుంటే సొంత ఇల్లు ఉండాలని, ఆ కల నెరవేరాలనే ఇందిరా గాంధీ ఇళ్లు నిర్మించి ఇచ్చారని సీఎం తెలిపారు. దేశంలో గుడి లేని ఊరు ఉండొచ్చేమో కానీ ఇందిరమ్మ కాలనీ లేని ఊరు ఈ దేశంలోనే లేదని చెప్పగలనని సీఎం పేర్కొన్నారు . కూడు.. గూడు.. గుడ్డ నినాదాన్ని ఇందిరా గాంధీ ఆచరణలోకి తీసుకువచ్చారన్నారు. సీలింగ్ యాక్ట్ ద్వారా గిరిజనులు, దళితులకు మిగులు భూముల పంపిణీ చేపట్టారని, ఇళ్ల నిర్మాణం చేపట్టారని తెలిపారు. ఇందిరమ్మ హయాంలో ఇంటి నిర్మాణానికి రూ.10 వేలు కేటాయిస్తే.. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అది రూ.1.25 లక్షలకు చేరిందని పెరిగిన ధరల ప్రకారం ఇప్పుడు తమ ప్రభుత్వం రూ.5 లక్షలు ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా.. గ్రీన్‌ఛానల్ ద్వారా లబ్ధిదారులకు రూ.5 లక్షలు అందజేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. తొలి ఏడాది సొంత స్థలం ఉన్నవారికి ఇళ్లు మంజూరు చేస్తామని, దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య సిబ్బంది, దళితులు, గిరిజనులు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లకు ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు, ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో గిరిజనులకు ఇళ్లు కేటాయించారని, ఆ తర్వాత వారికి ఇళ్ల కేటాయింపు సక్రమంగా జరగలేదన్నారు. తమ ప్రభుత్వం ఐటీడీఏల పరిధిలోని నియోజకవర్గాలు, ప్రాంతాల్లోని గిరిజనుల కోసం ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రత్యేక కోటా ఇస్తుందని వెల్లడించారు. నల్లమల్లలోని చెంచులు ఆదిలాబాద్‌లోని గోండులు భద్రాచలం లోని కోయలు.. ఎవరైతే తెలంగాణ మట్టి మనుషులో.. తెలంగాణ మూల పురుషులో వారికి ఇందిరమ్మ ఇళ్లను ప్రత్యేకంగా కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇంద్రవెల్లికి వెళ్లి తాను స్వయంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పట్టాలు అందజేసిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఈ నమూనానే పాటించాలని తాము సూచించడం లేదని, అదే సమయంలో తమకున్న స్థలంలో ప్రతి అంగుళాన్ని లబ్ధిదారులు వినియోగించుకునేలా ప్రతి మండల కేంద్రంలో మోడల్ హౌస్‌లు నిర్మిస్తామని.. లబ్ధిదారులు తమ అవగాహన కోసం వాటిని చూడాలని వసూచించారు. లబ్ధిదారులు తమ స్థోమతకు తగ్గట్లు అదనపు గదులు నిర్మించుకునే వెసులుబాటు కల్పిస్తున్నామని సీఎం చెప్పారు.

### తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ..

డిసెంబర్ 7 నుంచి 9వ తేది వరకు సచివాలయం ప్రాంగణంలో పండుగ సంబురాలు చేసుకోవాలన్నారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కణకు ప్రతిపక్షనేత కేసీఆర్ తో పాటు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ని అహ్వానిస్తామని..వారు తప్పక రావాలని కోరారు సీఎం.ప్రతిపక్ష పార్టీ నేతలు ప్రభుత్వానికి వారి సలహాలు, సూచనలు ఇచ్చి వారి పెద్దరికాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయని కేసీఆర్ కానీ ఆరు నెలల్లో ఆయన కోసం కోట లాంటి ప్రగతి భవన్‌ను, వాస్తు కోసం సచివాలయాన్ని నిర్మించుకున్నారని, గజ్వేల్, జన్వాడల్లో ఫాంహౌస్‌లు నిర్మించుకున్నారని ముఖ్యమంత్రి మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ భవనాల కోసం ఎకరాల కొద్ది భూమి కేటాయించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము మంచి లక్ష్యంతో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల

మిగితా 2వ పేజీలో




## పార్లమెంట్ ఆవరణలో
# వినూత్న నిరసన

### 'మోడీ-అదానీ ఏక్ హై, అదానీ సేఫ్ హై' జాకెట్లతో ఆందోళన
### అదానీ వ్యవహారంపై జేపీసీతో విచారణ జరపాలని డిమాండ్

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

పార్లమెంటు వద్ద గురువారం అదానీ 'ఇండిక్ట్ మెంట్' వ్యవహారంపై కాంగ్రెస్ ఎంపీలు విన్నూత్న నిరసన ప్రదర్శించారు. 'మోడీ–అదానీ ఏక్ హై' అని రాసి ఉన్న జాకెట్లు ధరించి మరీ నిరసన ప్రదర్శించారు. గౌతమ్ అదానీ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) విచారణ చేపట్టాలని ప్రతిపక్షాలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. గౌతమ్ అదానీతో పాటు, అతడి మేనల్లుడిని కూడా అమెరికా ప్రాసిక్యూటర్లు మోసగించిన అభియోగాలపై అపరాధులని తేల్చారు. ప్రతిపక్షాలు చేపట్టిన నిరసనలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ కూడా బ్లాక్ హాఫ్ జాకెట్లను ధరించి మరీ నిరసన ప్రదర్శించారు. వారంతా గురువారం పార్లమెంటు కాంప్లెక్స్ లో ఈ నిరసన చేపట్టారు. లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీ మాట్లాడుతూ " మోడీ, అదానీపై దర్యాప్తు జరపనివ్వడు, ఒకవేళ దర్యాప్తు జరగనిస్తే ఆయన మీద కూడా దర్యాప్తు జరగొచ్చు%%% మోదీ, అదానీ ఒక్కటే(మోడీ, అదానీ ఏక్ హై) " అని వివరించారు.

# పోషకాలతో కూడిన ఆహారం పెట్టండి

- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై హైకోర్టు కీలక ఆదేశాలు
- మాగనూరు, బూరుగుపల్లి ప్రభుత్వ పాఠశాల ఘటనలపై 6 వారాల్లో నివేదిక సమర్పించాలి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనంలో పోషకాలతో కూడిన ఆహారం పెట్టాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. గత నెల మాగనూరు, బూరుగుపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వికటించిన ఘటనలో 6 వారాల్లో నివేదిక సమర్పించాలని అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్‌ను ఆదేశించింది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధె, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావులతో కూడిన ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ పేర్కొన్న మూడు ఘటనలే కాకుండా మరో రెండు ఘటనలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయని ఆయా ఘటనలో బాధ్యులైన వాళ్లపై చర్యలు తీసుకున్నట్లు ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ కోర్టుకు తెలిపారు. నారాయణపేట్, కరీంనగర్ జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో వేర్వేరుగా రెండు కమిటీలు ఏర్పాటు చేశామని భోజనం వికటించిన ఘటనపై అధ్యయనం చేస్తున్నారని కోర్టుకు తెలిపారు. ఇప్పటికే నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపామన్నారు. 25వేల 941 ప్రభుత్వ పాఠశాలల్లో 18లక్షల మందికి పైగా విద్యార్థులన్నారని వాళ్లలో 75 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురయ్యారని ఏఏజీ వివరించారు. ఈ ఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర మార్గనిర్దేశకాల ప్రకారం గ్రామ, మండల, జిల్లా,రాష్ట్ర స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి మధ్యాహ్న భోజనాన్ని పక్కాగా పర్యవేక్షించాల్సి ఉంటుందని కానీ క్షేత్రస్థాయిలో ఇలా చోటు చేసుకోవడం లేదని పిటీషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ కోర్టుకు తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో సరైన ఆహారం పెట్టడం లేదని గుడ్డు కూడా ఇవ్వడం లేదని కోర్టుకు తెలిపారు. ఆ కమిటీలకు అదనంగానే ఇటీవల చోటు చేసుకున్న ఘటనలపై అధ్యయనానికి మరో రెండు కమిటీలు ఏర్పాటు చేశామని అన్ని కమిటీలు నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తున్నాయని ఏఏజీ కోర్టుకు తెలిపారు. మధ్యాహ్న భోజనం వడ్డించే ఏజెన్సీలకు ప్రభుత్వం ఇటీవలే 40 శాతం డబ్బులు పెంచినట్లు తెలిపారు. ఇరువైపు వాదనలు విన్న హైకోర్టు విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. బంజారాహిల్స్ పీఎస్‌లో విధులకు ఆటంకం కలిగించారంటూ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఫిర్యాదు చేయడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు అతని అనుచరులపై కేసు నమోదు చేశారు. గురువారం ఉదయం కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసం వద్ద భారీగా పోలీసులు చేరుకుని ఆయనను అరెస్ట్ చేశారు.

అంతకు ముందు మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ కార్యకర్తలు కౌశిక్‌రెడ్డి నివాసం వద్దకు చేరుకున్నారు. ఆయన ఇంట్లోకి ప్రవేశించేందుకు హరీశ్‌రావు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇంటి గేట్లు దూకి వెళ్లేందుకు కార్యకర్తలు యత్నించారు. హరీశ్‌రావును గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి హరీశ్‌రావును తరలిస్తున్న వాహనాన్ని కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు.

దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్?వేదికగా మండిపడ్డారు. ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తే కేసులు, కాంగ్రెస్ పార్టీ హామీలపై నిలదీస్తే అరెస్టులు చేయడమేంటని ప్రశ్నించారు. గురుకులాల్లో విద్యార్థుల అవస్థలను పరిశీలిస్తే కేసులు ఏంటని మండిపడ్డారు. ప్రభుత్వం కూలుస్తున్న పేదవారి ఇండ్లకు అడ్డుపడితే కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోని వ్యవస్థలను వాడుకొని దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేస్తే కేసులు పెడుతున్నారన్నారు. మా నాయకుల అరెస్టులు అప్రజాస్వామికమని తక్షణమే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావును విడుదల చేయాలంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటి వద్ద గురువారం హరీశ్‌రావుతో పాటు కొందరు బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు గచ్చిబౌలి పీఎస్‌కు తరలించారు. పార్టీ శ్రేణులతో కలిసి గచ్చిబౌలి పీఎస్‌కు వచ్చిన ఎమ్మెల్సీ కవిత.. హరీశ్‌రావును విడుదల చేయాలంటూ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. కార్యకర్తల ఆందోళనతో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది.

## సూట్ కేసులు మీకు.. కేసులు మాకా

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సూటుకేసులు మీకు .. అరెస్టులు మాకు అంటూ రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విరుచుకుపడ్డారు.. మాజీ మంత్రులు హరీశ్ రావు,జగదీశ్ రెడ్డిలతో పాటు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిలను నేటి ఉదయం అరెస్ట్ చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఈ మేరకు ఆయన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు.. ప్రభుత్వ తప్పులపై ప్రశ్నిస్తే కేసులు పార్టీ హామీలపై నిలదీస్తే అరెస్టులు పాలనలో లోపాలను గుర్తు చేస్తే కేసులు అంటూ ఆగ్రహించారు కేటీఆర్. గురుకులాల్లో విద్యార్థుల అవస్థలను పరిశీలిస్తే కేసులు ప్రభుత్వం లాక్కుంటున్న భూములపై ఎదిరిస్తే కేసులు అంటూ ఆగ్రహించారు. ప్రభుత్వం కూల్చుతున్న ఇండ్లకు అడ్డొస్తే కేసులుప్రభుత్వంలోని వ్యవస్థలను వాడుకుని దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేస్తే కేసులు ప్రజలపై కేసులు ప్రజాప్రతినిధులపై కేసులు కేసులు .. కేసులు .. కేసులు కాసులు మీకు కేసులు మాకు అంటూ ఫైర్ అయ్యారు. సూటుకేసులు మీకు .. అరెస్టులు మాకు అన్నారు. మాజీ మంత్రులు మా నాయకులు హరీష్ రావు, జగదీష్ రెడ్డి లతో పాటు మా ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,నాయకుల అరెస్ట్ లు అప్రజాస్వామికం..తక్షణం విడుదల చెయ్యాలని డిమాండ్ చేశారు. జాగో తెలంగాణ జాగో అంటూ నినాదించారు కేటీఆర్.




# పీఎస్ఎల్‌వీ సి-59 క్షిపణి ప్రయోగం సక్సెస్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) గురువారం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరోకోటలోని స్పేస్‌పోర్ట్ నుంచి యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ప్రోబా–3 మిషన్‌ను ప్రయోగించింది. బుధవారం, ఉపగ్రహ ప్రొపల్షన్ సిస్టమ్‌లో క్రమరాహిత్యం కనుగొనబడిన నేపథ్యంలో ప్రయోగం మళ్లీ షెడ్యూల్ చేసింది. భారత అంతరిక్ష సంస్థ దీనిని భారతదేశానికి గర్వకారణంగా పేర్కొంది. "లిఫ్టాఫ్ సాధించాం! పిఎస్ఎల్ వి–సి59 నింగిలోకి విజయవంతంగా దూసుకెళ్లింది.ఎన్ఎస్ఐఎల్ నేతృత్వంలో గ్లోబల్ మిషన్ ప్రారంభం అయింది. ప్రోబా–3 ఉపగ్రహాలను పంపించాం. అంతర్జాతీయ సహకారం, భారత కొలాబరేషన్, అంతరిక్ష విజయాలను కీర్తిస్తున్నే" అంటూ ఇస్రో ట్వీట్ చేసింది. సూర్యుడి ఉపరితలంపై ప్రోబా–3 అధ్యయనం చేయనున్నది. ఈ ప్రయోగాన్ని ఇస్రో ప్రయోగించింది. ఈ ఉపగ్రహం 310 కిలోల కరోనా గ్రాఫ్ స్పేస్ క్రాఫ్ట్, 240 కిలోల ఓకల్టర్ స్పేస్ క్రాఫ్ట్ ను నింగిలోకి పంపారు. ఈ రాకెట్ ను 550 కిలోల బరువుతో ఇన్–ఆర్బిట్ డెమోన్‌స్ట్రేషన్ లక్ష్యంగా ప్రయోగించారు. యూరోపియన్ అంతరిక్ష సంస్థతో కలిసి ఇస్రో అధికారులు సంయుక్తంగా దీనిని ప్రయోగించారు.

## కేసులు, ఎఫ్ఐఆర్‌లు గాంధీభవన్‌లో తయారవుతున్నాయి



- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ప్రజా పాలన కాదు, రాక్షస పాలన నడుస్తోందని, ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమర్జెన్సీ పాలన అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వాన్ని విమర్శించారు. గచ్చిబౌలి పీఎస్ నుంచి విడుదలైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.. " సీఎం రేవంత్ రెడ్డి మార్పు మార్పు అన్నడు. ఏం మార్పు తెచ్చిండు నిర్బంధాలు, అక్రమ అరెస్టులు తప్ప. అశోక్ నగర్ లో నిరుద్యోగుల వీపులు పగులగొట్టిండుగిరిజనులపై నిర్బంధం ప్రయోగించిండు. ఇందిరమ్మ రాజ్యం తెస్తనని ఎమర్జెన్సీ పాలన తెచ్చిండు. పోలీసులను అతిగా ప్రయోగించిన ఏ ప్రభుత్వమూ నిలబడలేదని గుర్తుంచుకో రేవంత్ రెడ్డీ... రాష్ట్రంలో ఇవాళ కేసులు, ఎఫ్ఐఆర్ లు పోలీస్టేషన్లలో తయారవుత లేవు, గాంధీభవన్లో తయారవుతున్నయి ఎవరిని అరెస్టు చేయాలో గాంధీభవన్ లోనే నిర్ణయిస్తున్నరు రేవంత్ రెడ్డి శాశ్వతం కాదు, పోలీసులు ఈ విషయం గుర్తు పెట్టుకోవాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పగ, ప్రతీకారంతో శాడిస్టిక్ ప్రెషర్ తో పనిచేస్తున్నడు ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టాలని టార్గెట్ పెట్టుకున్నడుఏడాది పాలనలో ఫ్లై ఓవర్, ఎస్టీపీ, కాళోజీ కళాక్షేత్రం ఇలా ఏదైనా కేసీఆర్ పాలనలో కట్టిందే వాటినే నువ్వు ప్రారంభిస్తున్నవు తప్ప, నీ ఏడాది పాలనలో ఒక భవనం కట్టినవా? రాష్ట్రంలో ప్రజా పాలన కాదు, రాక్షస పాలన నడుస్తున్నది ఏడో గ్యారంటీ అమలు కాలేదు, అక్రమ అరెస్టులు తప్ప మరే గ్యారంటీ అమలవుతలేదు

దేశ ప్రతిపక్ష నాయకుడిని, నన్నెందుకు అరెస్టు చేస్తరు అని రాహుల్ గాంధీ అడుగుతున్నడు మరి తెలంగాణలో కూడా మీ సీఎం రేవంత్ అదే చేస్తున్నడు కదా ముందు మీ ముఖ్యమంత్రిని బాగు చేయ్, లేదంటే మార్చెయ్ లగచర్లకు

## హెచ్‌సీఐటీఐ
# రహదారుల నిర్మాణానికి భారీగా నిధులు



- ఉత్తర్వులు జారీ చేసిన పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో హెచ్–సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నొవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)(హెచ్–సీఐటీఐ) ప్రాజెక్టులో భాగంగా చేపట్టే రహదారుల విస్తరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసింది. రూ.5,942 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు ఇస్తూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే టెండర్లు పిలిచి ఈ నిధులతో పనులు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మూడు రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలన విజయోత్సవాల్లో హెచ్–సిటీలో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తాజాగా ప్రభుత్వం జీహెచ్‌ఎంసీలోని ఆరు జోన్లలో 5 ప్యాకేజీల్లో చేపట్టనున్న పనులకు నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా సికింద్రాబాద్ జోన్‌లోని ఏవోసీ సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణం కోసం అత్యధికంగా రూ.940 కోట్లు విడుదలకు అనుమతులు ఇచ్చింది. శేరిలింగంపల్లి జోన్‌లో ఖాజాగూడ, ఐఐటీ జంక్షన్, విప్రో జంక్షన్ల అభివద్ధికి రూ. 837 కోట్లు, మియాపూర్

మిగితా 2వ పేజీలో

# రెండేళ్లలో నగరంలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు



- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రవాణాశాఖ లోగో ఆవిష్కరణ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రానున్న రెండేళ్లలో భాగ్యనగరంలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి తెస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మహాలక్ష్మి పథకం అమలుతో రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థను నష్టాల నుంచి గట్టెక్కించామన్నారు. ఇప్పటివరకు 115 కోట్ల మంది ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారని వివరించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఇవాళ రవాణాశాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఆర్టీసీ, రవాణశాఖ స్టాళ్లను పరిశీలించారు. రవాణాశాఖ లోగోను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి, రవాణాశాఖ, ఆర్టీసీ విజయాలపై కరపత్రం విడుదల చేశారు. 54 మంది ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. ఏడాది లోపే 55 వేల ఉద్యోగాలిచ్చామని ఒక్కటి తగ్గినట్లు నిరూపించినా క్షమాపణ చెప్పేందుకు సిద్ధమని మాజీ సీఎం కేసీఆర్, ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి సవాల్ విసిరారు. దేశంలో మెట్రో నగరాలన్నీ కాలుష్యకాసారంతో సతమతమవుతున్న వేళ హైదరాబాద్ ఆ ఊబిలో చిక్కుకోవద్దనే స్క్రాప్ పాలసీ తీసుకొచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.

# తెలంగాణ ప్రగతి నుంచి ఇతర రాష్ట్రాలు నేర్చుకోవచ్చు

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పదేళ్ల తెలంగాణ ప్రగతి నుంచి ఇతర రాష్ట్రాలు అనేక పాఠాలు నేర్చుకోవచ్చని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అభిప్రాయపడ్డారు. ప్రతి అంశంలోనూ రాష్ట్రాల మధ్య పోలిక చేయడం అవసరం లేదని, ఆయా రాష్ట్రాలకు తమ తమ బలాలు, ప్రాధాన్యతలు గుర్తించి, వాటి ఆధారంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. దేశంలోని రాష్ట్రాలు అనేక రంగాల్లో అద్భుతమైన ప్రగతిని సాధించాయని, వాటి అనుభవాల నుంచి తగిన పాఠాలు నేర్చుకోవడం ద్వారా అన్ని రాష్ట్రాలు ప్రగతి బాటలో పయనించవచ్చని చెప్పారు. కేరళలోని కొచ్చి నగరంలో గురువారం జరిగిన టైకాన్ కేరళ అవార్డుల ప్రధాన కార్యక్రమంలో కెటిఆర్ పాల్గొని ప్రసంగించారు. కేరళ రాష్ట్రం సామాజిక, ఆర్థిక రంగాల్లో సాధించిన ప్రగతిని ఆధారంగా తీసుకుని అనేక అంశాలను నేర్చుకునే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

తన వ్యక్తిగత హోదాలో, కేరళ రాష్ట్రంలో ఎంటర్‌ప్రీన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ కోసం అవసరమైన మద్దతు ఇస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. తెలంగాణతో పాటు హైదరాబాద్‌లో ఉన్న పారిశ్రామిక దిగ్గజ సంస్థలు, విశ్వవిద్యాలయాల వంటి ఉన్నత విద్యాసంస్థల భాగస్వామ్యాలను చేసేందుకు సహకారం అందిస్తానని తెలిపారు. స్వతహాగా మలయాళీలు కష్టపడే తత్వం కలిగిన వారు అని, ప్రపంచంలోని ఏ మూలకు వెళ్లినా అక్కడ కనిపించే కేరళ పారిశ్రామికవేత్తలను చూసినప్పుడు అర్థమవుతుందని కెటిఆర్ అన్నారు. ఇదే తీరుగా సొంత రాష్ట్రం కేరళలోనూ పెట్టుబడులను పెంచే కార్యక్రమాన్ని చేపట్టగలిగే శక్తి ప్రతి ఒక్క మలయాళీలోనూ ఉందని ప్రశంసించారు. కేరళ రాష్ట్రంలో పెట్టుబడులకు దోహదం చేయడంలో టైకాన్ కేరళ ప్రతినిధులు కృషిని కెటిఆర్ అభినందించారు.




టీఎస్ ఐపాస్ విధానం అనేక ప్రశంసలను అందుకున్నదికేరళ వంటి రాష్ట్రాలు సైతం తెలంగాణ విధానాల నుంచి నేర్చుకొని ముందుకు పోవచ్చు అని కెటిఆర్ పేర్కొన్నారు. కేవలం తెలంగాణ మాత్రమే కాదు ప్రపంచంలోని అత్యుత్తమ దేశాల పారిశ్రామిక విధానాలను పరిశీలించి వాటిలోని అద్భుతమైన అంశాలను స్వీకరించాలని అభిప్రాయపడ్డారు. వీటితోపాటు ఆయా రాష్ట్రాలకు ఉన్న ప్రత్యేక పరిస్థితులు అవసరాలను, ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని పాలసీలను రూపొందిస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ ఇండస్ట్రియల్ పాలసీలు, సెల్ఫ్ సర్టిఫికేషన్ ఆధారిత టిఎస్ ఐపాస్, తెలంగాణ ఐటి పాలసీ వంటి అనేక ఇతర పాలసీలను ఏర్పాటు చేసుకొని విజయవంతంగా ముందుకు తీసుకుపోయాయని చెప్పారు. టీఎస్ ఐపాస్ విధానం కేవలం భారతదేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రశంసలను అందుకున్నదని వ్యాఖ్యానించారు.

తెలంగాణలో మహిళ పారిశ్రామికవేత్తలను తయారు చేసేందుకు గతంలో అనేక అద్భుతమైన కార్యక్రమాలు చేపట్టామన్నారు. విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలతో పాటు విద్య అనంతరం ఉపాధి అవకాశాలను పెంచేందుకు వారిని పరిశ్రమలకు కంపెనీలకు అవసరమైన తీరుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉంది పేర్కొన్నారు. అందుకే గత పది సంవత్సరాలలో తమ ప్రభుత్వం టాస్క్ వంటి శిక్షణా సంస్థలను ఏర్పాటు చేయడంతో పాటు పరిశ్రమలకు యూనివర్సిటీలకు ఉన్నత విద్య సంస్థలకు మధ్య భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసిందని వివరించారు. యువత అపజయాలకు కృంగిపోవల్సిన అవసరం లేదని, ఓటమిని కూడా సెలబ్రేట్ చేసుకొని మరింత స్ఫూర్తితో గెలుపు వైపు ముందుకు పోయినప్పుడే జీవితంలో ఉన్నత విజయాలు సాధ్యమవుతాయని కెటిఆర్ అభిప్రాయపడ్డారు.

# తొలి ఏడాదిలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణం అమల్లో లోపాలు ఉంటే ప్రభుత్వ విశ్వసనీయత దెబ్బతింటుందని, పేదవాళ్లకు అన్యాయం జరుగుతుందనే ఆలోచనతోనే ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను సైతం వినియోగిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అంతే కాదు గతంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం తీసుకున్న రుణాలను మాఫీ చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణను అప్పుల్లోకి నెట్టారని కేసీఆర్ పై మండిపడ్డారు రేవంత్ రెడ్డి. రూ.16వేల కోట్ల మిగులు బడ్జెట్ తో రాష్ట్రాన్ని అప్పగిస్తే కేసీఆర్ పదవి నుంచి దిగిపోయే నాటికి రూ.7లక్షల కోట్లు అప్పులు చేశారని ఆరోపించారు.అధికారంలో ఎవరున్నా ప్రతిపక్ష నేతలు పార్టీలు సూచనలు, సలహాలు ఇవ్వడం సంప్ర దాయమని తెలిపారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ఆర్ అదే చేశారని..బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ హయాంలో మంత్రులతో పనులు చేయించుకున్న విషయాన్ని గుర్తు చేశారు రేవంత్ రెడ్డి.

ఇక కేటీఆర్, హరీష్ రావు వ్యవహరిస్తున్న తీరుపై రేవంత్ రెడ్డి సెటైర్ వేశారు. వాళ్లిద్దరి ప్రవర్తన చిన్నపిల్లలను గుర్తు చేస్తోందన్నారు. పక్క వాడి చేతిలో బొమ్మ విరగొట్టినట్లుగా.. నోటికొచ్చినట్లుగా ఏది తోస్తే అది మాట్లాడుతున్నారని ఇది సరైన తీరు కాదని చెప్పారు. తీరు కూడా మార్చుకోవాలని హెచ్చరించారు.తప్పు చేస్తే ఎవర్నీ వదిలిపెట్టమని చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పారు సీఎం.

# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బంగాళాఖాతంలో శుక్రవారం మరో అల్పపీడనం ఏర్పడనున్నట్టు వాతావారణశాఖ వెల్లడించింది. దీని ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాలో వాతావరణం మేఘావృతమై ఉంటుందని, పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురుస్తుందని తెలిపింది. ఈనెల 6,7 తేదీల్లో ఏర్పడే ఆవర్తనం దక్షిణ దిశగా పయనించే అవకాశం ఉన్నట్టు పేర్కొంది. అటు ఫెంగల్ తుఫాను బలహీనపడి అల్పపడీనంగా మారి అరేబియా సముద్రంలోకి ప్రవేశించింది.



## సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా

# జస్టిస్ మన్మోహన్

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న మన్మోహన్ గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా ఆయనతో ప్రమాణం చేయించారు. సుప్రీంకోర్టు ఇతర సిట్టింగ్ జడ్జీల సమక్షంలో సుప్రీంకోర్టులో ఈ వేడుక జరిగింది. జస్టిస్ మన్మోహన్ ప్రమాణస్వీకారంతో.. సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్య 33కి చేరింది.1962 , డిసెంబర్ 17 జన్మించిన జస్టిస్ మన్మోహన్ 1987లో ఢిల్లీ క్యాంపస్ లా సెంటర్ నుంచి ఎల్ఎల్బీ పూర్తి చేశారు. అదే ఏడాది సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తూ న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 2003లో సీనియర్ న్యాయవాదిగా నియమితులైన ఆయన 2008లో ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2009లో శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2023లో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా, 2024లో ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. నవంబర్ 28న సుప్రీంకోర్టు కొలీజియం జస్టిస్ మన్మోహన్‌ను అత్యున్నత న్యాయస్థానానికి సిఫారసు చేసిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 3న కేంద్రం ఆ సిఫారసును ఆమోదించింది.

# హెచ్‌సీఐటీఐ రహదారుల నిర్మాణానికి భారీగా నిధులు

(మొదటి పేజీ తరువాయి)

ఎక్స్ రోడ్డు నుంచి ఆల్విన్ ఎక్స్ రోడ్డు వరకు ఆరు వరుసల ఫ్లైఓవర్, లింగంపల్లి నుంచి గచ్చిబౌలి వైపు మూడు వరుసలతో అండర్ పాస్ నిర్మాణానికి రూ.530 కోట్లు విడుదల చేసింది. ఎల్బీనగర్ జోన్‌లో టీకేఆర్ కాలేజీ జంక్షన్ నుంచి మందమల్లమ్మ చౌరస్తా వరకు ఆరు వరుసల ఫ్లైఓవర్ కోసం రూ.416 కోట్లు, ఖైరతాబాద్ జోన్ పరిధిలో రైతిబౌలి నుంచి నానల్ నగర్ జంక్షన్ వరకు మల్టీ లెవల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.398 కోట్లు విడుదల చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

# మెగా ఫుడ్‌పార్కు అభివృద్ధే లక్ష్యం

**బలగం టీవీ, హైదరాబాద్**

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడులో ఏర్పాటు చేసిన మెగా ఫుడ్‌పార్కును అన్ని విధాలుగా అభివృద్ధి చేసి రైతులను బాగు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. గురువారం సత్తుపల్లి వచ్చిన ఆయన మండలంలోని బుగ్గపాడు మెగా ఫుడ్‌పార్కును వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సభలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. రాజకీయ, అభివృద్ధి పరంగా ఖమ్మం జిల్లాకు మంచి పేరుందన్నారు. జలగం వెంగళరావు మొదలుకొని తుమ్మల నాగేశ్వర రావు వరకు ఈ జిల్లాను రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన జిల్లాగా తీర్చిదిద్దారని తెలిపారు. 2008లో కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి బుగ్గపాడు ఫుడ్‌పార్కుకు శంకుస్థాపన చేశారన్నారు. అప్పట్లోనే ఫుడ్‌పార్కు కోసం సుమారు రూ.100 కోట్లు కేటాయించి పార్కులో పరిశ్రమల ఏర్పాటుకు మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. ఆ తరువాత వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఫుడ్‌పార్కును పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాగమయి దయానంద్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో దాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఔత్సాహిత పారిశ్రామిక వేత్తలను ఫుడ్‌పార్కులో పరిశ్రమల ఏర్పాటుకు ఆహ్వానించడంతో పాటు మహిళా సాధికారత కోసం మహిళలు కూడా చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొనేందుకు ప్రభుత్వపరంగా ప్రోత్సహించ నున్నట్టు చెప్పారు. ఇందుకోసం వారికి వివిధ రకాల చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై 200 మందికి తగ్గకుండా ఔత్సాహిక మహిళలను గుర్తించి వారికి శిక్షణను ఇవ్వనున్నట్టు తెలిపారు. అంతేగాక ప్రతి నియోజకవర్గంలోనూ మినీ ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుందన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ



- రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన
- పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల బోయినిపల్లి మండలం కోరెం నుండి నల్గొండ వరకు చేపట్టబోయే రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ: గత 13 ఏళ్లలో బి.ఆర్.ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నీరు గార్చిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యా శాఖను బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. చదువుతోపాటు ఉద్యోగాలు కూడా రావాలని స్కిల్ యూనివర్శిటీని ఏర్పాటు చేశారని అన్నారు.ప్రతి నియోజక వర్గంలో దశల వారీగా ట్రైనింగ్ సెంటర్ లను ప్రారంభించబోతున్నామని, భవిష్యత్తులో చొప్పదండి నియోజకవర్గం ఎడ్యుకేషన్ హబ్ గా మారబోతుందని అన్నారు. బోయినిపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలను గత ప్రభుత్వం నీరు గర్చిందని, ప్రస్తుతం ఉన్న పాఠశాల మొత్తం శిథిలావస్థకు చేరుతుందని, తన దృష్టికి రాగానే స్వయంగా సందర్శించి పాఠశాలను ఉన్న సమస్యలు తెలుసుకున్నానని అన్నారు. వర్షాకాలంలో విద్యార్థులకు ఇబ్బందులు పడుతున్నారని, పాములు, తెల్లు వస్తుండడంతో వెంటనే నూతనంగా నిర్మించిన అసంపూర్తిగా ఉన్న పాఠశాలను సందర్శించి, జిల్లా కలెక్టర్ కు సమస్య చెప్పగానే వెంటనే నిధులు మంజూరు చేసి, పాఠశాలను పూర్తిస్థాయిలో రూపు దిద్దుకుందని అన్నారు. మిగతా సమస్యలు ఏమైనా ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని, చిన్న చిన్న సమస్యలు తెలుపగానే ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే జిల్లా కలెక్టర్ కు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించమని తెలిపారు. ఉపాధ్యాయులు ప్రైవేట్ పాఠశాలలు దీటుగా విద్య బోధనను అందించి, రాబోయే అకాడమిక్ ఇయర్ వరకు పాఠశాలలో అధిక సంఖ్యలో విద్యార్థులను చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యేకు విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డీ.ఈ.వో జగన్మోహన్ రెడ్డి, జెడ్పి సీఈవో వినోద్, తహశీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో జయశీల, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్, ఉమ్మడి జిల్లా మాజీ డిసిఎంహెచ్ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, మాజీ ఎంపీపీ వేణుగోపాల్, సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్, మండల విద్యాధికారి శ్రావణ్, ఏఎంసి వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి మండల యూత్ అధ్యక్షులు నాగుల వంశీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# అల్లు అర్జున్, ఆయన టీం పై కేసు నమోదు



**బలగం టీవీ , హైదరాబాద్**

ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సంధ్య థియేటర్‌లో తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన క్రమంలో సంధ్య థియేటర్ పై కేసు నమోదు చేసిన పోలీసులు యాజమాన్యంతో పాటు అల్లు అర్జున్, ఆయన టీం పైన కూడా కేసు నమోదు చేశారు. ముందస్తు అనుమతి తీసుకోకుండా అల్లు అర్జున్ తీసుకురావడంపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. బుధవారం సినీ హీరో అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా చిక్కడపల్లి ఆర్టీసీ క్రాస్ రోడ్డులో సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో మహిళ మతి చెందడంపై సెంట్రల్ జోన్ డీసీపీ గురువారం రాత్రి చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్‌తో కలిసి డీసీపీ మాట్లాడుతూ

బుధవారం రాత్రి 9.40 సమయంలో పుష్ప 2 ప్రీమియర్ షో సంధ్య థియేటర్లో ఏర్పాటు చేశారన్నారు. దీనికి అధిక సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారని, ప్రేక్షకులతో పాటు సినిమాలో నటించిన కీలక నటులు హాజరవుతారని సమాచారం తమకు లేదని అన్నారు. కనీసం థియేటర్ యాజమాన్యం కూడా మాకు ఆ సమాచారం చెప్పలేదు, థియేటర్ యాజమాన్యం కూడా ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదని అన్నారు. పబ్లిక్ ను కంట్రోల్ చేసేందుకు ఎలాంటి ప్రైవేటు భద్రతను ఏర్పాటు చేయలేదన్న ఆయన ఎంట్రీ, ఎగ్జిట్ లలో కూడా ఎటువంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదని అన్నారు.సినీ హీరో అల్లు అర్జున్ థియేటర్‌కు వస్తున్నారని తెలియడంతో సినీ ప్రేక్షకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో థియేటర్ వద్దకు చేరుకుని గేట్లను తోసుకుంటూ లోపలికి చొచ్చుకొని వెళ్లారన్నారు.

9.30 కి తన వ్యక్తిగత భద్రత సిబ్బందితో సంధ్య థియేటర్ వద్దకు అల్లు అర్జున్ చేరుకున్నారని అన్నారు. ఆ సమయంలో అల్లు అర్జున్ థియేటర్ లోపలికి వెళ్లిన సమయంలో భద్రతా సిబ్బంది ప్రేక్షకులను నెట్టి వేయడం ప్రారంభించారని, అప్పటికే థియేటర్ లోపల బయట ప్రేక్షకులతో కిక్కిరిసిపోయి ఉందని అన్నారు. అదే సమయంలో అల్లు అర్జున్ లోపలికి వెళ్లగా ప్రేక్షకులకు మధ్య తోపులాట చోటుచేసుకుందన్నారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరగడంతో దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన 35 ఏండ్ల రేవతి, ఆమె కుమారుడు 13 ఏండ్ల శ్రీతేజ్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారని తెలిపారు. వెంటనే పోలీసులు వారికి సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలించగా రేవతి అనే మహిళా అప్పటికి చనిపోయిందని చెప్పారు. ఆమె కుమారుడు శ్రీ తేజ్ పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స అందిస్తున్నారని తెలిపారుఈ ఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాంఅని అన్నారు. బిఎన్ఎస్ యాక్టీవ్ లోని 105 118(1), రెడ్ విత్ త్3(5) సెక్షన్ల కింద చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

## 12న కీర్తి సురేష్ వివాహం

**బలగం టీవీ , హైదరాబాద్**

హీరోయిన్ కీర్తి సురేశ్ త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్న సంగతి తెలిసిందే. తన స్నేహితుడు ఆంటోనీతో ఆమె ఏడడుగులు వేయనున్నారు. ఈ నెల 12న వీరి వివాహం జరగనుంది. అయితే తాజాగా ఈమె పెళ్లి వేడుకకు సంబంధించిన వెడ్డింగ్ కార్డ్ ఫొటో బయటకు వచ్చింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.






## ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన గంగిపల్లి మల్లయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారంఇంట్లో ఎవరు లేని సమయంలో మధ్యాహ్నం ఒంటిగంటకు ఉరివేసుకొని చనిపోయినాడని మృతుని కొడుకు గంగిపల్లి రాజేశం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు మండల రక్షక బటనిలయం అధికారి పృథ్వీధర్ గౌడ్ తెలిపారు.

## అక్రమ మట్టిని తరలిస్తున్న టిప్పర్ వాహనాన్ని పట్టుకున్న ఎస్సై పృథ్విదర్

**బలగం టీవీ , బోయినిపల్లిబీ**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వరదవెల్లి గ్రామ శివారులో ని వరద కాలువకు సంబంధించిన మట్టిని అక్రమంగా తరలిస్తున్న ఒక మట్టి టిప్పర్ వాహనాన్ని పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి, మైనింగ్ అధికారులకు రాసి పంపనైనది మండల ఎస్సై పృథ్వీధర్ తెలిపారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**బలగం టీవీ , తంగళ్ళపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం మండేపల్లి లో గ్రామ శాఖ అధ్యక్షుడు ఆసాని మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులు గౌరవెని జ్యోతి 29000, ఆసాని ప్రతాపరెడ్డి 60000, నేనెర్ల అరుణ 60000 రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సీఎంఆర్ఎఫ్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మరియు ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ధ్యేయమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు కాంగ్రెస్ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి కి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిషరీష్ ప్రధాన కార్యదర్శి చెన్నమనేని ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు ధర్మారెడ్డి చందు, పాతూరి సురేందర్,ఆసాని దేవి రెడ్డి, సల్లూరి వెంకటి, బోనాల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# సినిమా ప్రాణం తీసింది

- సంధ్య థియేటర్‌లో అభిమానుల తొక్కిసలాట
- మహిళ మృతి.. ఆమె కుమారుడి పరిస్థితి విషమం

**బలగం టీవీ , హైదరాబాద్**



పుష్ప-2 సినిమా అందరికన్నా ముందుగా చూడాలనుకున్న ఉత్సాహం ఓ కుటుంబంలో విషాదం నింపింది. ఓ మహిళ ప్రాణం తీసింది. హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్‌కు వెళ్లిన ఓ కుటుంబంలోని మహిళ అక్కడ జరిగిన తొక్కిసలాటలో మృతి చెందింది. ఆమె కొడుకు పరిస్థితి కూడా ప్రస్తుతం విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రముఖ సినీ హీరో అల్లు అర్జున్ నటించిన పుష్పా 2 సినిమా ముందస్తు షోను బుధవారం రాత్రి సంధ్య థియేటర్‌లో వెయ్యడంతో దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి (39) తన భర్త భాస్కర్, ఇద్దరు పిల్లలు ఏడేండ్ల శ్రీ తేజ్ , ఏడేండ్ల సన్వీకలతో కలిసి సినిమా హాలుకు వచ్చింది. అదే సమయంలో హీరో అల్లు అర్జున్ సంధ్య థియేటర్‌కు రాగా ఆయన అభిమానులు థియేటర్ గేట్ లోపలికి చొచ్చుకొని వచ్చారు. ఈ సమయంలో జరిగిన భారీ తొక్కిసలాటలో రేవతి, ఆమె కొడుకు శ్రీ తేజలు కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే పోలీసులు గమనించి విద్యానగర్‌లోని దుర్గ భాయి దేశముఖ్ హాస్పిటల్‌కు వారిని తరలించారు. రేవతి అప్పటికే మతి చెందగా, శ్రీ తేజ పరిస్థితి విషమంగా ఉండటంతో అతన్ని బేగంపేట కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు రేవతి మతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి మార్చురీకి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇదిలా ఉండగా పోలీసులు సంధ్య థియేటర్ పై కేసు నమోదు చేశారు. మతి చెందిన మహిళకు న్యాయం జరగాలని పలు ప్రజాసంఘాల నాయకులు థియేటర్ ముందు ధర్నా చేపట్టాయి.

# నేటి నుంచి పింక్ బాల్ టెస్ట్



**బలగం టీవీ, అడిలైడ్**

అడిలైడ్ వేదికగా శుక్రవారం ప్రారంభం కానున్న డై/నైట్ టెస్ట్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియాతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో సమష్టిగా రాణించి 295 పరుగుల భారీ తేడాతో టీమిండియా విజయాన్నందుకున్న సంగతి తెలిసిందే. రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించి ఈ సిరీస్‌లో తమ ఆధిక్యాన్ని 2-0తో చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. ఇప్పటికే ఈ మ్యాచ్ కోసం టీమిండియా అన్ని విధాల సిద్దమైంది.

ఇక భారత్‌తో అడిలైడ్‌లో శుక్రవారం నుంచి జరగనున్న రెండో టెస్టుకు ఆస్ట్రేలియా తుది జట్టును ప్రకటించింది. స్పీడ్ బౌలర్ స్కాట్ బోలాండకు స్థానం కల్పించారు. 18 నెలల బ్రేక్ తర్వాత అతను మళ్లీ జాతీయ జట్టుకు ఆడనున్నట్లు కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ తెలిపాడు. అడిలైడ్‌లో డే అండ్ నైట్ టెస్టు కావడంతో.. బోలాండ్‌కు అవకాశం ఇచ్చినట్లు తెలుస్తోంది. తొలి టెస్టులో గాయపడ్డ జోష్ హేజిల్‌వుడ్ స్థానంలో అతన్ని తీసుకున్నారు. ఆల్‌రౌండర్ మార్ష్‌కు వెన్ను నొప్పి ఉన్నా.. అతన్ని రెండో టెస్టుకు కొనసాగిస్తున్నారు.బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా రెండు జట్ల మధ్య 5 టెస్టు మ్యాచ్‌లు జరగనున్నాయి.

## ఓపెనర్‌గా కేఎల్ రాహుల్.. మిడిల్ ఆర్డర్‌లో నేను : రోహిత్ శర్మ



ఆస్ట్రేలియాతో పింక్ బాల్ టెస్ట్‌కు టీమిండియా ఓపెనర్ ఎవరా? అనే సందిగ్ధతకు కెప్టెన్ రోహిత్ శర్మ క్లారిటీ ఇచ్చాడు. కేఎల్ రాహులే ఓపెనర్‌గా కొనసాగుతాడని స్పష్టం చేశాడు. మిడిలార్డర్‌లో తాను బ్యాటింగ్ చేస్తానని వెల్లడించాడు. ఈ నిర్ణయం తనకు కష్టమైనా.. జట్టుకు అదే బెస్ట్ అని అభిప్రాయపడ్డాడు. మ్యాచ్ నేపథ్యంలో గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. కేఎల్ రాహులే ఓపెనింగ్ చేస్తాడు. నేను మిడిలార్డర్‌లో ఏదొక స్థానంలో బ్యాటింగ్ చేస్తా. బ్యాటర్‌గా ఇది నాకు కష్టమే. కానీ జట్టుకు ఇదే బెస్ట్ ఆప్షన్. ఎలాంటి నిర్ణయమైనా జట్టు విజయం కోసమే తీసుకుంటాం. తొలి టెస్ట్‌లో యశస్వి జైస్వాల్-కేఎల్ రాహుల్ అద్భుతంగా ఆడారు. నా కొడుకును ఎత్తుకొని మరి వారి బ్యాటింగ్ చూశాను. రాహుల్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. అందుకే బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేయాల్సిన అవసరం లేదనిపించింది. భవిష్యత్తు గురించి ఇప్పుడే చెప్పలేం. పరిస్థితులను బట్టి మార్పులు ఉంటాయి.

# భారత మహిళా జట్టుపై ఆసీస్ విజయం



**బలగం టీవీ, హైదరాబాద్**

తొలి వన్డేలో భారత మహిళా జట్టుపై ఆస్ట్రేలియా విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా 100 పరుగులకు ఆలౌటైంది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆసీస్ కేవలం 16.2 ఓవర్లలోనే ఐదు వికెట్లను కోల్పోయి విజయం సాధించింది. ఓపెనర్లు జార్జియా వోల్ (46), ఫోబ్ లిట్చ్‌ఫీల్డ్ (35) రాణించారు. భారత బౌలర్లలో రేణుకా ఠాకూర్ 3, ప్రియా మిశ్రా 2 వికెట్లు తీశారు.

కెరీర్‌లో తొలి వన్డే ఆడుతోన్న ఆసీస్ బౌలర్ మెగాన్ స్కట్ (5/19) ఐదు వికెట్ల ప్రదర్శనతో భారత్ బ్యాటర్లను బెంబేలెత్తించింది. భారత బ్యాటర్లలో జెమీమా రోడ్రిగ్స్ (23) టాప్ స్కోరర్. ఆమెతోపాటు హర్లీన్ డియోల్ (19), హర్మన్ ప్రీత్ కౌర్ (17), రిచా ఘోష్ (14) మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు. ఓపెనర్లు ప్రియా పునియా 3, స్మృతీ మంధాన 8, దీప్తి శర్మ 1, సైమా ఠాకూర్ 4, టిటాస్ సధు 2 పరుగులు చేశారు. ఆసీస్ బౌలర్లలో స్కట్ 5 వికెట్లు.. కిమ్ గార్త్, గార్డెనర్, సదర్లాండ్, అలానా కింగ్ తలో వికెట్ తీశారు.

# 20 ఓవర్లలో 349 రన్స్..

● **సయ్యద్ ముస్తాక్ అలీ టీ20లో చరిత్ర సృష్టించిన బరోడా..**



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో బరోడా జట్టు టీ20 ఫార్మాట్ అధ్యిక స్కోర్ సాధించి చరిత్ర సృష్టించింది. ఇండోర్‌లో సిక్కింతో జరిగిన మ్యాచ్‌లో భాను పానియా అజేయ సెంచరీతో బరోడా 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 349 పరుగులు చేసింది. పొట్టి ఫార్మాట్‌లో ఒక మ్యాచ్‌లో ఇదే అత్యధిక స్కోరు. ఈ ఏడాది గాంబియాపై నాలుగు వికెట్లకు 344 పరుగులు చేసిన జింబాబ్వే రికార్డును బరోడా బ్రేక్ చేసింది. అనంతరం సిక్కిం నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 86 పరుగులే చేసి 263 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది.

బరోడా కెప్టెన్ కృనాల్ పాండ్యా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నాడు. శశ్వత్ రావత్ (43), అభిమన్యు సింగ్ (53) తొలి వికెట్‌కు 92 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టుకు శుభారంభం అందించారు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన భాను పానియా బ్యాట్‌తో అదరగొట్టాడు. కేవలం 51 బంతుల్లోనే ఐదు ఫోర్లు, 15 సిక్సర్ల సహాయంతో అజేంగా 134 పరుగులు చేశాడు. భాను పానియా తుఫాన్ ఇన్నింగ్స్‌తో బరోడా టీ20 ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసి రికార్డును నెలకొల్పింది.సిక్కింపై బరోడా ఇన్నింగ్స్‌లో 37 సిక్సర్లు బాదగా.. అందులో భాను ఒక్కడే 15 సిక్సర్లు కొట్టాడు. ఇక బరోడా తరపున శివాలిక్ శర్మ 17 బంతుల్లో 55 పరుగులు, విష్ణు సోలంకి 16 బంతుల్లో 50 పరుగులు చేశారు. సిక్కిం మీడియం పేసర్ రోషన్ కుమార్ నాలుగు ఓవర్లలో 81 పరుగులు ఇచ్చాడు. టీ20 మ్యాచ్‌లో భారత్ తరపున అత్యంత చెత్త గణాంకాలతో కొత్త రికార్డును సృష్టించాడు.

# ఆసియా హాకీ ఛాంపియన్‌గా భారత్




**బలగం టీవీ, న్యూఢిల్లీ**

జూనియర్ ఆసియాకప్ హాకీ ఛాంపియన్‌గా భారత్ నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్లో భారత్ 5-3 తేడాతో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో వరుసగా మూడో టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఓవరాల్‌గా భారత్‌కు ఇది ఐదో టైటిల్. గతంలో భారత్ 2004, 2008, 2015, 2023లో విజేతగా నిలిచింది.

పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్లో ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఆట ప్రారంభమైన మూడో నిమిషంలోనే పాకిస్థాన్ గోల్ నమోదు చేసి దూకుడు కనబర్చింది. అయితే నిమిషం వ్యవధిలోనే ఆర్జీత్ భారత్‌కు గోల్ అందించాడు. దాంతో స్కోర్లు సమమ య్యాయి. ఇరు జట్లు తీవ్రంగా ప్రయత్నించినా.. ఫస్ట్ క్వార్టర్‌లో మరో గోల్ నమోదు కాలేదు. రెండో క్వార్టర్ ఆరంభంలోనే ఆర్జీత్ సింగ్ మరో గోల్ కొట్టగా.. నిమిషం వ్యవధిలోనే దిల్‌రాజ్ సింగ్ మరో గోల్‌తో భారత్ ఆధిక్యాన్ని డబుల్ చేశాడు. రెండో క్వార్టర్ చివర్లో సుఫియాన్ గోల్ నమోదు చేయడంతో ఫస్టాఫ్ ముగిసే సరికి భారత్ 3-2తో ఆధిక్యంలో నిలిచింది.

భారత్ తరపున ఆర్జిత్ నాలుగు గోల్స్(4వ నిమిషం, 18వ, 47వ, 54వ నిమిషం)తో సత్తా చాటగా.. దిల్ రాజ్ సింగ్(19వ) ఓ గోల్ కొట్టాడు. పాకిస్థాన్ తరపున సుఫియాన్(30వ నిమిషం, 39వ నిమిషం) రెండు గోల్స్ నమోదు చేయగా.. హనన్ షాహిత్(3వ నిమిషం) ఓ గోల్ నమోదు చేశాడు.

## కోహ్లీ జంక్ ఫుడ్ అస్సలు తినరు : అనుష్క శర్మ

**బలగం టీవి, న్యూఢిల్లీ**

స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ వ్యాయామం, డైట్‌కు ప్రాధాన్యమిస్తాడన్న సంగతి తెలిసిందే. అయితే, కోహ్లీ ఫిట్‌నెస్ వెనుక ఉన్న రహస్యాన్ని ఆయన సతీమణి, స్టార్ నటి అనుష్క శర్మ తాజాగా బయటపెట్టారు. కోహ్లీ మూడింటికే అధిక ప్రాధాన్యత ఇస్తారని చెప్పుకొచ్చారు. ఫిట్‌నెస్, ఆహారం విషయంలో క్రమశిక్షణతో ఉంటారని తెలిపారు. రోజూ ఉదయం లేవగానే కార్డియో వర్కవుట్స్ చేస్తారని వెల్లడించారు. తనతో క్రికెట్ కూడా ప్రాక్టీస్ చేస్తారని చెప్పారు. ఇక ఆహారం విషయానికి వస్తే.. జంక్ ఫుడ్ అస్సలు తినరని, కూల్ డ్రింక్స్ వంటి వాటికి దూరంగా ఉంటారని స్పష్టం చేశారు. కోహ్లీ దాదాపు 10 ఏళ్లుగా బటర్ చికెన్ తినలేదని అనుష్క చెప్పుకొచ్చారు. ఇక కోహ్లీ నిద్రకు కూడా తగిన ప్రాధానత్య ఇస్తారని తెలిపారు. నిద్ర విషయంలో అస్సలు రాజీపడరని చెప్పారు. దాదాపు ఎనిమిది గంటలపాటు ప్రశాంతంగా నిద్రపోతారని వివరించారు. మంచి నిద్రతో తగిన విశ్రాంతి పొందుతాడని అనుష్క తెలిపారు.

